www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 జనవరి 2024
5
ఏలూరు

24న జీలుగుమిల్లిలో జగనన్నకు చెబుదాం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు/జీలుగుమిల్లి

ప్రతి బుధ, శుక్రవారాల్లో మండలస్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ఈ నెల 24న జీలుగుమిల్లిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. 24వ తేదీ బుధవారం ఉదయం పది గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. జీలుగుమిల్లి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయవాడలో ఏలూరు జిల్లా నేతల ఆందోళన

ఏలూరులో అంగన్వాడీల ఆందోళన

నిర్బంధం.. నిరంకుశత్వం..!

చిరుద్యోగులైన అంగన్‌వాడీలపై ప్రభుత్వం దమనకాండకు దిగింది. సమ్మెలో భాగంగా సోమవారం అంగన్‌వాడీలు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులను ఉసిగొల్పి తీవ్ర నిరంకుశత్వం ప్రదర్శించింది. జిల్లావ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీలను ఎక్కడికక్కడే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు, కల్యాణ మండపాలకు తరలించి తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. విజయవాడలో ధర్నా చేస్తున్న వారిని సైతం బస్సులో పెదవేగి పోలీస్‌శిక్షణా కేంద్రానికి తరలించి కనీసం భోజనం కూడా పెట్టకుండా ఆకలితో అలమటించేలా చేసింది. అంగన్‌వాడీలపై నిర్బంధాన్ని నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో చేయడంతోపాటు అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలంటూ పోలీస్ స్టేషన్ల వద్ద ఆందోళనలు సాగాయి. విజయవాడ నుంచి తరలించిన అంగన్‌వాడీ రామలక్ష్మికి తీవ్ర అస్వస్థతకు గురైన పోలీసులు కనికరించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. చివరికి ఆమెకు ప్రాణపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలో రోజంతా హైటెన్షన్ కొనసాగగా ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంగన్‌వాడీలపై కొనసాగిన ప్రభుత్వ దమనకాండ

చలో విజయవాడను అడ్డుకునేందుకు ఖాకీల యత్నం

వేలాది మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలింపు

పెదవేగి పోలీస్ శిక్షణా కేంద్రంలో పలు జిల్లాలకు చెందిన 500 మంది నిర్బంధం

ప్రభుత్వ తీరుకు నిరసనగా అఖిలపక్షం ఆధ్వర్యాన రాస్తారోకో

పోలీస్ స్టేషన్ల ఎదుట, శిక్షణా కేంద్రం వద్ద సాగిన ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు అర్బన్

'జగనన్నకు చెబుదాం' అంటూ అంగన్‌వాడీలు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం సోమవారం ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వం అంగన్‌వాడీలపై తీవ్ర నిర్బంధం ప్రయోగించి ఇబ్బందులకు గురిచేసింది. ఆదివారం సాయంత్రం నుంచి జిల్లావ్యాప్తంగా పలువురు అంగన్‌వాడీలకు నోటీసులిచ్చి విజయవాడ వెళ్లొద్దంటూ పోలీసులు హెచ్చరించారు. అర్ధరాత్రి రెండు గంటల తర్వాత పోలీసులు తమ నిరంకుశత్వాన్ని ప్రదర్శించారు. విజయవాడలో నిరవధిక దీక్షా శిబిరంలో ఉన్న అంగన్‌వాడీలను బలవంతంగా పోలీసులు వ్యానుల్లో ఎక్కించి పెదవేగిలోని పోలీస్ శిక్షణా కేంద్రానికి తరలించారు. ఇక్కడికి తరలించిన వారిలో విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లా, కృష్ణా జిల్లాతోపాటు రాష్ట్రంలోని అనేక జిల్లాలకు చెందిన అంగన్‌వాడీలు ఉన్నారు. మొత్తం 497 మంది అంగన్‌వాడీలను పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించినట్లు తెలిసింది. వీరిలో కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు సైతం ఉన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు టి.ప్రసాద్‌ను సైతం తరలించారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించిన వారికి భోజనంగాని, టిఫిన్‌గాని సరిగా పెట్టకపోవడంతో ఆకలితో అలమటించిన పరిస్థితి ఉంది. దీంతో సిపిఎం, సిపిఐతోసహా పలు వామపక్ష పార్టీల నాయకులు అక్కడికి చేరుకుని బయట నుంచి బిస్కెట్ ప్యాకెట్లు వంటివి పట్టుకెళ్లినా పోలీస్ శిక్షణా కేంద్రం లోపలికి అనుమతించలేదు. దీంతో గేటు పైనుంచి లోపలికి విసరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏలూరు వన్‌టౌన్, టుటౌన్, త్రీటౌన్‌తోపాటు బస్టాండులోనూ దాదాపు వందలాది మంది అంగన్‌వాడీలను విజయవాడ వెళ్లకుండా అడ్డుకుని నిర్బంధించారు.

బస్సుల్లో పోలీసుల తనిఖీలు

కలపర్రు టోల్‌గేట్ వద్ద అంగన్‌వాడీలను అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. చేబ్రోలు, కైకలూరు, చింతలపూడితోపాటు జిల్లావ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో వేలాది మంది అంగన్‌వాడీలను నిర్బంధించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామలక్ష్మి

అఖిలపక్షం ఆధ్వర్యాన రాస్తారోకో

అంగన్‌వాడీల నిర్బంధాన్ని నిరసిస్తూ అఖిలపక్షం ఆ ధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి, కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, జనసేన నాయకులు ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. విజయవాడలో ధర్నా చేస్తున్న వివిధ జిల్లాలకు చెందిన కొంతమంది అంగన్‌వాడీలను ఏలూరులోని పోలీస్ స్టేషన్లకు తరలిస్తుండగా ఆ బస్సును రాస్తారోకో చేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో అడ్డుకుని బస్సులో ఉన్నవారిని కిందికి దింపేశారు. వీరిలో సిఐటియు పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ తదితరులు ఉన్నారు. రాస్తారోకోతో గంటకుపైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం నిర్బంధించిన అంగన్‌వాడీలను విడుదల చేయాలని నాయకులు, అంగన్‌వాడీలు పోలీస్‌స్టేషన్ల ఎదుట నిరసన తెలిపారు. విజయవాడ నుంచి తరలించిన వారిని మళ్లీ అక్కడ దింపుతామని బస్సుల్లో ఎక్కించిన పోలీసులు వారిని పెదవేగిలోని పోలీస్ శిక్షణా కేంద్రానికి తీసుకువెళ్లగా అక్కడ ఖాళీలేదని మళ్లీ తాడేపల్లిగూడెంలోని ఇంకొల్లు కల్యాణ మండపానికి తరలించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి బస్సులో తిప్పడం తప్ప కనీసం భోజనం కూడా పెట్టించని పరిస్థితి ఉంది. పోలీస్ శిక్షణా కేంద్రం వద్ద వామపక్ష నాయకులు ఎ.రవి, పి.కిషోర్, కృష్ణచైతన్య, డాంగే శ్రీనివాస్, బొప్పన కిరణ్, కె.వెంకట్, పిల్లి రామకృష్ణతోపాటు పలువురు ఆందోళన నిర్వహించారు. తీసుకొచ్చిన అంగన్‌వాడీలను బస్సులో విజయవాడలో చేర్చాలని పట్టుబట్టడంతో సాయంత్రం వరకూ అంగన్‌వాడీలు అక్కడే ఉండిపోయిన పరిస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీల నిరసనలు, అరెస్టులతో రోజంతా హైటెన్షన్ నెలకొంది. అంగన్వాడీల నిరసనలో పాల్గొన్న వారిలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, పి.కిషోర్‌తోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించి రంగంలోకి సచివాలయ పోలీసులు

గ్రామ సచివాలయ ఉద్యోగులుగా ఉన్న మహిళా పోలీసులకు పోలీస్ విధులు అప్పగించొద్దని హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై సచివాలయ పోలీసులకు పోలీస్ విధులు అప్పగించొద్దంటూ డిజిపి అన్ని జిల్లాల ఎస్‌పిలకు ఆదేశాలు సైతం జారీచేశారు. అప్పటి నుంచి మహిళా పోలీసులకు పోలీస్ విధులు అప్పగించడం లేదు. సోమవారం అంగన్‌వాడీల నిరసన కార్యక్రమం సందర్భంగా సచివాలయ మహిళా పోలీసులను మళ్లీ రంగంలోకి దింపారు కలపర్రు టోల్‌గేట్ వద్ద, పలు స్టేషన్ల వద్ద మహిళా పోలీసులే విధులు నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి వరకూ వారితో పోలీస్ విధులు చేయించిన పరిస్థితి నెలకొంది. ఇది కోర్టు ఉత్తర్వులకు పూర్తి విరుద్ధం. దీనిపై పోలీస్ అధికారులు ఏమి సమాధానం చెబుతారో వేచిచూడాలి.

దీక్షాధారుల పట్ల కనికరం చూపని పోలీసులు

విజయవాడలో ఆరు రోజులుగా దీక్షలో ఉన్న అంగన్‌వాడీ యూనియన్ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి కెవి.రామలక్ష్మిని పోలీసులు అర్ధరాత్రి బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించారు. ఆమె దీక్షలో ఉండటంతో ఆరోగ్యంగా బాగోలేదని అంబులెన్స్‌లో తరలించాలని తోటి అంగన్‌వాడీలు కోరినా పోలీసులు కనికరం చూపలేదు. వ్యాన్‌లో కుక్కి పెదవేగి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. దీంతో ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించింది. దీంతో అంగన్‌వాడీలంతా తీవ్ర ఆందోళనకు గురై పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అప్పుడు అంబులెన్స్‌ను రప్పించి దగ్గరలోని గోపన్నపాలెం పిహెచ్‌సికి తరలించారు. సుగర్, బిపి ఎక్కువగా ఉండటంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరులోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ రామలక్ష్మికి వెంటిలేటర్ ఏర్పాటు చేసి ఆక్సిజన్ అందించి వైద్యం అందించారు. ఆమె వెంట దేవీపట్నం మండలానికి చెందిన అంగన్‌వాడీలు కె.వెంకటరత్నం, కోసు మంగాయమ్మ ఉన్నారు. సాయంత్రానికి ఆమె ఆరోగ్యం కొంత మెరుగుపడటంతో రామలక్ష్మిని జనరల్ వార్డుకు తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి నిరంతరం తెలుసుకుని మెరుగైన వైద్యం అందేందుకు కృషి చేశారు. సాయంత్రం వామపక్ష నాయకులు, కార్మిక సంఘాల నాయకులు రామలక్ష్మిని పరామర్శించారు. ఆమెను మంగళవారం డిశ్చార్జి చేయనున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రాణపాయ స్థితిలో ఉన్న వ్యక్తి పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలపర్రు టోల్‌గేట్ వద్ద

ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద

ఏలూరులో రాస్తారోకో

చింతలపూడిలో..

ముదినేపల్లిలో

కలిదిండిలో

నూజివీడులో..

చేబ్రోలులో..

పోలవరంలో..

విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్

మహిళా ఓటర్లే అత్యధికం

జిల్లా ఓటర్లు 16,24,416 మంది

తుది ఓటర్ల జాబితా విడుదల

పారదర్శకంగా అన్ని ఫిర్యాదులూ పరిష్కరించాం

సమస్యలు ఉంటే పరిష్కారానికి అవకాశం

తహశీల్దార్ కార్యాలయం, పోలింగ్ కేంద్రాల వద్ద జాబితా ప్రచురణ

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో ఓటర్లకు సంబంధించిన తుది జాబితాను విడుదల చేశామని, జిల్లాలో మొత్తం 16,24,416 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 8,30,390 మంది మహిళలు, 7,93,897 మంది పురుషులు, 129 థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారని, జిల్లాలో మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. పోలింగ్ స్టేషన్లు, తహశీల్దార్ కార్యాలయాల్లో ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందని, సమస్యలు ఉంటే వెంటనే బిఎల్‌ఒలు, తహశీల్దార్లను కలిసి పరిష్కరించుకోవచ్చునన్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి బుధవారం సమావేశాలు ఏర్పాటు చేసి, ఓటర్ల జాబితా పురోగతిని వివరించి వారి అభిప్రాయాలను, సూచనలను తీసుకున్నామన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నియమ నిబంధనల ప్రకారం 2024 జనవరి ఒకటో తేదీని అర్హత తేదీగా నిర్ణయించి జిల్లాలో గడిచిన అక్టోబర్ 22 నుంచి ప్రత్యేక ఓటర్ల జాబితా-2024 కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 1,93,870 దరఖాస్తులు రాగా పరిశీలించి తుదిజాబితా ప్రచురించారన్నారు. ఫారం-6 ద్వారా 95,943 దరఖాస్తులు అందగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి 2,925 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. ఫారం-7 ద్వారా 60,875 అభ్యంతరాలు రాగా పరిశీలన అనంతరం 57,224 దరఖాస్తులు పరిష్కరించినట్లు వివరించారు. వీటిలో 27,347 మంది చనిపోయిన వారి ఓట్లను తొలగించగా, శాశ్వత వలసదారులు 21,904, డూప్లికేట్ వంటి ఇతర దరఖాస్తులు 7,973 పరిష్కరించినట్లు తెలిపారు. అనర్హత కలిగిన 3,651 దరఖాస్తులు తిరస్కరించడం జరిగిందన్నారు. ఫారం-8 ద్వారా 37,052 దరఖాస్తులు అందగా 36,042 దరఖాస్తుదారులు కోరిన మార్పులు ఆమోదించినట్లు వివరించారు. అనర్హత కలిగిన 1,010 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. జంక్ కేరెక్టర్ డోర్‌నెంబర్‌కు సంబంధించి 1,219 దరఖాస్తులు అందగా 1,085 దరఖాస్తులు పరిష్కరించినట్లు తెలిపారు. 134 దరఖాస్తులు ఫైనల్ పబ్లికేషన్ అయిన తర్వాత ఆమోదించబడతాయన్నారు. ఒకే డోర్ నెంబర్‌తో పదికి మించి ఓట్ల నమోదు కోసం 39,617 దరఖాస్తులు అందగా వాటిలో 39,582 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. మిగిలిన 35 దరఖాస్తులు ఫైనల్ పబ్లికేషన్ తర్వాత ఆమోదించబడతాయన్నారు. రాజకీయ పార్టీల నుంచి 29,949 ఫిర్యాదులురాగా అన్నింటినీ పరిష్కరించామన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 1,743 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ తాగునీరు, విద్యుత్, విభిన్న ప్రతిభావంతులకు ర్యాంపులు, మరుగుదొడ్లు, ఫర్నీచర్ వంటి సదుపాయాలు ఏర్పాటు పూర్తి చేశామన్నారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు ఎస్‌విఇఇపి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు ప్రాముఖ్యత, వినియోగంపై పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విడుదలైన జాబితా ప్రకారం గతంకంటే 35,794 మంది ఓటర్లు పెరిగారు. నోటిఫికేషన్ వచ్చే వరకూ మార్పులు, చేర్పులు ఉంటాయని, ఓటులేని వాళ్లు పరిశీలించుకుని సంబంధిత అధికారులను కలిసి నమోదు చేసుకోవచ్చునన్నారు. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాతోపాటు, అందుకు సంబంధించిన సీడీలను సోమవారం జరిగిన సమావేశంలో అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జెసి లావణ్యవేణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పనులను అడ్డుకుని రోడ్డుపై అడ్డంగా కూర్చున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్న రైతులు

అధికారుల జోక్యంతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులను శెట్టివారిగూడెం రైతులు అడ్డుకున్నారు. తాము పొలాలకు వెళ్లేందుకు సర్వీసు రోడ్లు నిర్మిస్తామని గతంలో హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదని వారు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలియగానే ఎస్ఐ ప్రసాద్, రెవెన్యూ అధికారులు హుటాహుటీన అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారు లేవనెత్తిన డిమాండ్‌పై గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణదారులతోనూ చర్చించారు. తాము సర్వీసు రోడ్లు నిర్మిస్తామని నిర్మాణదారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ఉద్యోగుల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలి

అధికారులకు జెసి లావణ్యవేణి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఎన్నికల కమిషన్ రూపొందించిన వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. సోమవారం గౌతమీ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు రాబోయే సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఎన్నికల కమిషన్ రూపొందించిన వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. దీనికి సంబంధించిన పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ గురించి సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉద్యోగస్తుల డేటా వివరాల్లో ఎటువంటి పొరపాట్లూ లేకుండా స్పష్టమైన సమాచారం పొందుపరచాలని, ఫిబ్రవరి నెలాఖరునాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని వివిధ శాఖల జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ సూర్యతేజ, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జల జీవన్ మిషన్ కార్యక్రమం కింద మంజూరైన పనులను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. ఏలూరులో జల జీవన్ మిషన్, సత్యసాయి తాగునీరు ప్రాజెక్టు 2023-24 సంవత్సరానికి సంబంధించిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలోని కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టమ్ కింద అప్పగించాల్సిన పనులను గ్రామ జల సంఘాలకు వెంటనే వర్క్ ఆర్డర్ ఇవ్వాల్సిందిగా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇని ఆదేశించారు. పెదవేగి ఎంవిఎస్ ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన అనుమతుల కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హర్ ఘర్ జల్ విలేజ్‌గా ప్రకటించాల్సిన 18 విలేజ్‌లను మూడు రోజుల్లో పూర్తి చేయాల్సిందిగా తెలిపారు. అనంతరం ఐటిడిఎ పిఒ ఎం.సూర్య తేజ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నీటి వనరులు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్‌ఇ కె.శ్రీనివాసరావు, డ్వామ పీడీ ఎ.రాము, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయ రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వై.రామకృష్ణ, ట్రాన్స్ కో ఎస్‌ఇ సాల్మన్ రాజు, డిఎంహెచ్‌ఒ శర్మిష్ట పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం

డాక్టర్ మోహన్‌పై కేసు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి పూర్వపు సూపరెంటెంట్ ఎవిఆర్ మోహన్‌కు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాల్లో చేరిన కేసులో సూపరెంటెంట్ పాత్ర కూడా ఉందని నిర్ధారించిన పోలీసులు ఆయనకు ఆ కేసులో 41 నోటీసులు ఇచ్చారు. సంబంధిత వివరాల ప్రకారం కరోనా సమయంలో పెద్ద ఎత్తున ఏలూరు జిల్లా కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించేందుకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో టెక్నీషియన్ల నియామకాలు జరిగాయి. ఈ క్రమంలో నకిలీ సర్టిఫికెట్లతో కొంతమంది ఉద్యోగాలు సంపాదించారని జిల్లా కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదులు అందాయి. దీనిపై జిల్లా కలెక్టర్ ఇచ్చిన సమాచారంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న ఇద్దరిపై, తణుకులో విధులు నిర్వహిస్తున్న మరో ఇద్దరిపై, రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. అయితే అప్పుడు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి సూపరెంటెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ ఎవిఆర్ మోహన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో రెండో పట్టణ పోలీసులు డాక్టర్ మోహన్‌కు ఈ కేసులో 41 నోటీసులను అందించారు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు సమాచారం.



బహుమతిని అందుకుంటున్న గాయత్రి

చిత్రలేఖనంలో గాయత్రికి ద్వితీయ బహుమతి

ప్రజాశక్తి - ఏలూరు

బాల అయ్యప్ప క్షేత్రం దొండపాడు, ఏలూరు వారు నిర్వహించిన చిత్రలేఖనం ముగ్గుల పోటీల్లో కె.గాయత్రి(6వ తరగతి) జెడ్‌పిహెచ్, శనివారపుపేట విద్యార్థినికి ద్వితీయ బహుమతి లభించింది. సోమవారం మకరజ్యోతి ఉత్సవాల్లో బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ప్రకాష్‌రావు, ఫస్ట్ అసిస్టెంట్ కె.రాజ్‌కుమార్, పాఠశాల కమిటీ, పేరెంట్స్ కమిటీ, పాఠశాల సిబ్బంది విజేతను, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు ఎమ్‌డి.ఇర్షాద్ అహ్మద్‌ను అభినందించారు.

బాలికల పాఠశాలలో సౌర విద్యుత్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని జెడ్‌పి గర్ల్స్ హైస్కూల్‌లో 1973-74 టెన్త్ బ్యాచ్ విద్యార్థి ఇరవా వెంకట నాగసాయి కాశీ విశ్వనాథరావు రూ.2.85 లక్షల విలువైన సౌర విద్యుత్ వ్యవస్థను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం వివిఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ జెడ్‌పి బాయ్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థి విశ్వనాథరావు ఈ పాఠశాలకు సౌర విద్యుత్ వ్యవస్థ, మరో రూ.లక్ష డిపాజిట్ చేసి వడ్డీని విద్యార్థులకు మెరిట్‌గా అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళ్లజోళ్లను అందజేస్తున్న రవీందర్

162 మందికి కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి వెంకట రవీందర్ 162 మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రమణక్కపేట టిడిపి అధ్యక్షులు రంగు ఆంజనేయులు, గోళ ఆంజనేయులు, వంకదార విఘ్నేశ్వర, లక్క పాము కాంతారావు పాల్గొన్నారు.

24న జయహో బిసి సదస్సు

ప్రజాశక్తి - ముసునూరు

జయహో బిసి ముసునూరు మండల సదస్సులను విజయవంతం చేయాలని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, మండల అధ్యక్షులు దేవినేని బలరాము పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు రైస్ మిల్లులో ఈనెల 24న జయహో బిసి సదస్సు కార్యక్రమ ఏర్పాట్లను టిడిపి నాయకులు పరిశీలించారు.

యనమదలలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నూజివీడు రూరల్ : నూజివీడు మండలంలోని బత్తులవారి గూడెం, యనమదల గ్రామాల్లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి ముసునూరి లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ కేంద్రం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండిఒ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, రైతు భరోసా వంటి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత గోగినేని అప్పారావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

9 మంది అరెస్టు : రూ.10,300 స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండలంలోని సుంకొల్లు అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు బైకులు, నాలుగు కోడిపుంజులు, రూ.10,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రమాదకరంగా 33/11 కెవి విద్యుత్ తీగలు

గతంలో చిన్నారి కాళ్లకు వైర్లు తగిలి కాళ్లు, చేతులు పోయినటువంటి పరిస్థితి..

నవరాత్రుల పనిలో వైర్లు తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలం ప్రగఢవరం గ్రామంలో ముతారాసుల కాలనీలో 33/11 కేవి విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. ఆ కాలనీ వాసులు కనీసం



కాలనీలోని విద్యుత్ వైర్లు

నూతన ఇళ్లు నిర్మించుకోవటానికి అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గతంలో ఆడుకోడానికి ఇంటి డాబాపైకి వెళ్లిన చిన్నారికి వైర్లు తగిలి కాళ్లు, చేతులు పూర్తిగా పోయినటువంటి సంఘటన చోటుచేసుకుంది. అదేవిధంగా శివాలయం మీదుగా వైర్లు వెళ్లటంతో జాతర, ఉత్సవాల్లో లైటింగ్ పెట్టేటప్పుడు కరెంట్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటనలు నెలకొన్నాయి. కాలనీలో ఇంటి పైనుంచి వెట్కర్లు వెళ్లటంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. వైర్లు మార్చమని అనేక మార్లు ఉన్నతాధికారులతో సహ తమ

ఇంటి డాబాకు దగ్గరగా విద్యుత్ వైర్లు

సమస్యను చెప్పినప్పటికీ నేటికీ వైర్లు మార్చకపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైర్లు పక్కకు వెళ్లేటట్లు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

జీలుగుమిల్లి సిఐగా క్రాంతి కుమార్ బాధ్యతల స్వీకరణ

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా టి.క్రాంతి కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అమలాపురం టౌన్ నుంచి జీలుగుమిల్లి సర్కిల్‌కు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన వెంకటేశ్వరావును విజయవాడ కమిషనరేట్‌కు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో జీలుగుమిల్లికి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలియజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించడంతో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

బాధ్యతలు తీసుకున్న క్రాంతి కుమార్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే ఆశా వర్కర్లు కొద్ది నెలలుగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా నాయకురాలు కె.పోసమ్మ డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పిహెచ్‌ఎన్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిని సోమవారం మండల నాయకుల ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్లు ఆశా డే పేరుతో సంబంధం లేని పనులు చేయిస్తున్నారని ఉదయం, సాయంత్రం, హెల్త్ సెంటర్స్‌కి వెళ్లి అటిండెనెట్స్ వేయాలని, పిఎంఎంవివై దరఖాస్తులు ఆశాలే రాయాలని

వినతిని అందిస్తున్న ఆశాలు

వేధిస్తున్నారన్నారు. ప్రశ్నించిన వారిని రికార్డ్ పేరుతో, ఆన్‌లైన్ పనుల పేరుతో ఇబ్బంది పెడుతూ, చెప్పిన పని చేయకపోతే ఆశా ఇన్సెంటివ్ రిపోర్ట్స్‌పై సంతకం చేయమని బెదిరిస్తున్నారని వాపోయారు. హై రిస్క్ కేసులకు, టుబెక్టమి కేసులకు వైద్యులు రావడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిని ఇచ్చిన వారిలో ఆశా వర్కర్లు విజయలక్ష్మి, వనిత, లక్ష్మి, జ్యోతి, దేవమాత పాల్గొన్నారు.

హాస్టల్ పేరు మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రయివేటు పాఠశాలకు ఐటిడిఎ నిధులు కేటాయించి, నిర్మాణం చేయడం తప్పయినప్పటికీ.. గిరిజన నిధులతో నిర్మాణం చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాల పేర్లను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న వారిపై క్రిమినల్ కేసులు వేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. జీలుగుమిల్లి మండలం వంకవారి గూడెం గ్రామంలోని ప్రయివేట్ స్కూల్ వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాలకు అనుబంధంగా ఐటిడిఎ నిధుల ద్వారా గిరిజన బాలుర హాస్టల్ నిర్మాణం చేశారు. హాస్టల్ పేరును శ్రీగోకరాజు రంగరాజు విద్యార్థి వసతి గృహంగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ ఖండించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తక్షణమే పాఠశాల అనుబంధంగా నిర్మాణం చేసిన హాస్టల్ భవనంపై ఉన్న పేరును తొలగించాలని ఆయన కోరారు. హాస్టల్ భవనంపై గిరిజన బాలుర హాస్టల్‌గా మార్చని యెడల గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గిరిజన నిధుల్ని దుర్వినియోగం చేయడమే కాకుండా ప్రయివేటు సంస్థ యాజమాన్యం పేర్లను గిరిజనుల నిధులతో నిర్మాణం చేసిన భవనాలకు తమ పేర్లను రాయించడం పట్ల ఐటిడిఎ అధికారులను విమర్శించారు. తక్షణమే హాస్టల్ భవనంపై ఉన్న పేరును తొలగించి ఐటిడిఎ హాస్టల్‌గా మార్చాలని లేని పక్షంలో కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని ఆందోళన చేపడతామని అధికారుల్ని, ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మార్చిన పేరుతో బాలుర వసతి గృహం

పార్టీలకు ఓటర్ల జాబితా అందజేత

అన్ని తహశీల్దార్, ఇఆర్‌ఒ కార్యాలయాల్లో బిఎల్‌ఒల వద్ద పరిశీలించుకోవచ్చు

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వెల్లడి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో సోమవారం ఓటర్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా రాజకీయపక్షాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సిర్రా భరత్ (బిఎస్‌పి), పి.ఆదిశేషు(సిపిఎం), ఎస్.బాబూ ప్రసాద్(కాంగ్రెస్), ఎం.దశరథ కుమార్(ఆమ్ ఆద్మీ), పాలి ప్రసాద్(టిడిపి), కలవకొల్లు సాంబ(వైసిపి) హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ అన్ని తహశీల్దార్, ఇఆర్‌ఒ కార్యాలయాల్లో బిఎల్‌ఒల వద్ద ప్రదర్శించే జాబితాలను ఓటర్లు పరిశీలించుకోవచ్చునన్నారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితా ప్రకారం 16,24,416 మంది ఓటర్లుగా నమోదైయ్యారన్నారు. శాశ్వతంగా వలసలు వెళ్లిన వారిని గుర్తించడం, మృతి చెందిన ఓటర్లను తొలగించడం, యువతను ఓటరుగా నమోదుచేయడం, జంక్ ఓటర్లను సరిచేయడం, 10 కంటే ఎక్కువ ఓట్లు వున్న ఇళ్లను విచారణ చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పక్షాలకు తుది ఓటర్ల జాబితా

రాజకీయపక్షాల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

ముద్రణా ప్రతులను, సిడిలను కూడా అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత తుది జాబితా ప్రకటించడం ద్వారా గతంలో విడుదల చేసిన ముసాయిదా జాబితా కన్నా జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో 35,7 94 ఓటర్లు అధికంగా నమోదయ్యారన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 1,743 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన 99 శాతం పూర్తయిందని, నెలాఖరునాటికి మొత్తం సౌకర్యాలు కల్పించే పనులు పూర్తవుతాయని తెలియకజేశారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 25వ తేదిన జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇఆర్‌ఒలు, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి పాల్గొన్నారు.

ఫోన్ కాల్స్‌తో జాగ్రత్త : ఎస్‌పి మేరి ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అంతర్జాలంలో వచ్చే మెసేజ్‌లతోనే కాదు ఫోన్ కాల్స్‌తో కూడా ఎంతో జాగ్రత్త వహించాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ప్రజలకు సూచించారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈవారం జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ ఫిర్యాదులను తెలిపేందుకు ఎస్‌పి కార్యాలయానికి చేరుకున్నారు. స్పందనలో ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్‌పి ఈ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మరింత ముందడుగు వేసి ఫోన్‌లకు మెసేజ్‌లు పంపడమే కాకుండా వీడియో కాల్స్ రూపంలో కూడా ప్రజలకు ఎరవేసి వారి వద్ద నుంచి డబ్బులు గుంజుతున్నారని తెలియజేశారు. ప్రజలు వీడియో కాల్స్, ఫోన్ కాల్స్ తెలియని నెంబర్ల ద్వారా వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సైబర్ పోలీసులు వీటిపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. అలాగే సివిల్ సంబంధిత ఫిర్యాదులను తాము పరిష్కరించమని ఆయా ఫిర్యాదులను కోర్టుల్లో పరిష్కరించుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని : ఏలూరు రెండో పట్టణ ప్రాంతానికి చెందిన మహిళ తనకు పరిచయమైన వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసి, తన వద్ద నుంచి రూ.4 లక్షలు అపహరించాడని, అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఏలూరు ఒకటో పట్టణ ప్రాంతానికి చెందిన వ్యక్తి సైబర్ నెరగాళ్లు తన ఖాతా నుంచి రూ.86 వేలు అపహరించారని ఫిర్యాదు చేశాడు. ఏలూరు రాయల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రాంతానికి చెందిన ఒక మహిళ సభ్య సమాజం తలదించుకునేలా తన భర్త సోదరి తాను గర్భవతి అని తెలిసి కూడా తనపై దాడి చేయడంతో తనకు గర్భస్రావం అయిందని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది.

బిసిలు చైతన్యవంతులు కావాలి

టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాస్

ప్రజాశక్తి - టి.నరసాపురం

బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా చైతన్యవంతులు కావాలని పోలవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. స్థానిక విజయలక్ష్మి థియేటర్ వద్ద సోమవారం జయహో బిసి కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణ రావు గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపికి బిసిలే వెన్నెముకగా నిలుస్తున్నారన్నారు. బిసిలను జగన్‌మోహన్ రెడ్డి పూర్తిగా మోసగించారని విమర్శించారు. బిసిలకు చట్టసభల్లో సీట్లు కేటాయించాలన్నారు. టిడిపితోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు అన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే రాష్ట్రానికి చంద్రబాబే ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర

మాట్లాడుతున్న బొరగం శ్రీనివాస్

కార్యదర్శులు జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, టిడిపి అధికార ప్రతినిధి శేషు, జోనుబోయిన సోంబాబు, కొండపల్లి రవి, ఆచంట అనిల్ కుమార్, తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి రామ్మోహన్, ఆచంట సూర్యనారాయణ, భీమవరపు జగన్మోహన్‌రావు, బొంతు సత్యనారాయణ, కొరివి వెంకటేశ్వరరావు, కొల్లి రమేష్ పాల్గొన్నారు.

3న న్యూ మాడ్యులర్ లీగల్ సర్వీస్ క్యాంప్

జిల్లా జడ్జి నాగ శైలజ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఫిబ్రవరి 3వ తేదీన న్యూ మాడ్యులర్ లీగల్ సర్వీస్ క్యాంప్ నిర్వహించనున్నట్లు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ తెలిపారు. సోమవారం కోర్టు ఆవరణలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి హాస్పటల్‌లో ఉండే రిహాబిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. క్యాంపులు, స్టాల్స్ నిర్వహించి ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

అన్నదానానికి కూరగాయల వితరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుమల తిరుపతి, ద్వారకాతిరుమల దేవస్థానాలకి చుట్టుపక్కల గ్రామంలోని రైతులు సహకారంతో కూరగాయలు పంపుతున్నట్లు రైతు నక్క సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతికి 12 టన్నులు, ద్వారకాతిరుమలకు 4 టన్నులు కూరగాయలను అన్నదానానికి పంపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పేకేటి అప్పారావు, చంద్రు బాలాజీ, మట్టాడి ఆంజనేయులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

గణపవరం మండలం, సిహెచ్.అగ్రహారం గ్రామమునకు చెందిన బిక్కాల్ల రాజేష్ భార్య బిక్కాల్ల జ్యోతి అను నేను సిహెచ్.అగ్రహారం నుండి గణపవరం వచ్చి నా యొక్క పాస్‌పోర్టు నెంబరు **U0623452** పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకుని జిరాక్స్ మరియు ఒరిజినల్ పాస్‌పోర్టును కవర్లో పెట్టుకుని బండిపై గణపవరం నుండి సిహెచ్.అగ్రహారం వెళ్లే దారిలో కవర్‌తో సహా మార్గమధ్యలో పడిపోయినది. దారిలో ఎంత వెతికిన దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బిక్కాల్ల జ్యోతి, భర్త: రాజేష్
సిహెచ్.అగ్రహారం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 6301413482

మహారాజశ్రీ గౌరవ జూనియర్ సివిల్ జడ్జి, జంగారెడ్డిగూడెం వారి కోర్టులో
O.S. No. 241/2023

బిట్వీన్:
శ్రీమతి బొండ శిరీష -వాది
Vs
శ్రీ బొప్పినేటి లక్ష్మినారాయణ -ప్రతివాది

To:
శ్రీ బొప్పినేటి లక్ష్మినారాయణ, తండ్రి: గిరి రాజు, 45 సం॥లు, నాగులగూడెం గ్రామం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావా గ్రంథంలో ప్రతివాదైన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినను వేర్వేరు కారణములు చూపుచు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పై గ్రంథను **ది. 31-01-2024వ తేదీకి వాయిదా వేసినారు. ఆ రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** గౌరవ పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

(ది. 29-11-2023 తేదీన జారీ చేసిన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ప్రకటన జారీ చేయటమైనది)

యన్.వి.బి.యల్.ఆచారి, న్యాయవాది
పంగిడిగూడెం రోడ్, హెడ్ పోస్ట్ ఆఫీసు వద్ద,
జంగారెడ్డిగూడెం జంగారెడ్డిగూడెం
21-01-2024 సెల్ 9440215126

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. 48/2023
ఒ.ఎస్. 160/2017

DHR:
దంతులూరి జోగి జగన్నాధరాజు
JDR:
రుద్రరాజు తులసి అన్నపూర్ణ, W/o. రామకృష్ణంరాజు, కలవపూడి, కాళ్ళ మండలం.

Order 5 Rule 20 C.P.C. ప్రకారం J.D.R. కు నోటీసు

పై నెంబరు ఇ.పి.లో J.D.R. కు కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిన అమలు జరగనందున కోర్టు వారు దావాను **ది. 01-02-2024వ తేదీకి వాయిదా వేసినారు.** కావున J.D.R. పై తేదీన పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10 గంటలకు** హాజరై మీ సంజాయిషీ తెలుపుకోవలసినదిగాను లేని పక్షంలో మీ పరోక్షంలో ఇ.పి. తీర్మానం కాబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

మోగంటి శివకృష్ణ
వాది తరుపు లాయర్
భీమవరం భీమవరం
ది.22-01-2024 సెల్: 9848539039

గ్రామపంచాయతి కార్యాలయం, కలిదిండి
టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 01/2024 తేది.20-01-2024

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కలిదిండి గ్రామపంచాయితీ నందు ఈ క్రింది పనులు 2024-25 సం॥నకు నిర్వహించుటకు గాను ది. 29-01-2024 తేది మధ్యాహ్నం గం॥ 12.00లకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను టెండర్లుదారుల సమక్షమున మధ్యాహ్నం గం॥ 12.30 ని॥లకు తెరవబడును. ఇతర వివరములు కార్యాలయం నందు సంప్రదించవచ్చును.

వ.నెం.	పని వివరము	కావాల్సిన వ్యక్తులు	ధరావత్తు	పని కాలము
1	పారిశుధ్య పనులు స్వీపర్లు-5 డ్రైవర్స్-2	7	రూ. 5000/- లేక సాల్వెన్సీ	1-4-2024 టు 31-03-2025
2	కాంట్రాక్టు వాచ్ మెన్ చెరువు కాపలా	1	రూ. 5000/- లేక సాల్వెన్సీ	1-4-2024 టు 31-03-2025
3	కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్లు	2	రూ. 5000/- లేక సాల్వెన్సీ	1-4-2024 టు 31-03-2025
4	కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ అసిస్టెంట్లు	2	రూ. 5000/- లేక సాల్వెన్సీ	1-4-2024 టు 31-03-2025

నోట్: 1. పైన తెలిపిన పనులు కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను. 2. ఈ గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి పేమెంటు ఇవ్వబడును. 3. గతంలో ఈ పంచాయితీలో పని చేసిన వారికి ప్రధమ ప్రాధాన్యత ఇవ్వబడును.

సం/- **శ్రీ ఆర్.వి.ఉదయ్‌కుమార్**
పంచాయితీ కార్యదర్శి, కలిదిండి గ్రామపంచాయితీ

సం/- **శ్రీమతి ఎం.మారుతి ప్రసన్న**
సర్పంచ్, కలిదిండి గ్రామపంచాయితీ